సాక్షి పార్వతీపురం మన్యం

బుధవారం । 31 । జనవరి । 2024



పల్లె ప్రగతికి ప్రాధాన్యం

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పల్లెప్రగతికి అధిక ప్రాధాన్యమిస్తోంది. మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. నాడు–నేడు అనేలా తీర్చిదిద్దుతోంది. - 8లో



సెంచూరియన్‌ను సందర్శించిన అధ్యాపకులు - 8లో

టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని విశాఖపట్నానికి చెందిన పలువురు అధ్యాపకులు మంగళవారం సందర్శించారు.



ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

విజయనగరం మహారాజ సంగీత,నృత్య కళాశాలలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం ఘనంగా జరిగింది. - 8లో

న్యూస్‌రీల్

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పరిశీలన



తాళ్లదుమ్మ సచివాలయలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

జియ్యమ్మవలస: మండలంలోని తాళ్లదుమ్మ సచివాలయంలో పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను కలెక్టర్ నిషాంత్ కుమార్ మంగళవారం పరిశీలించారు. రిజిస్ట్రేషన్ తీరును సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వైఎస్సార్ జగనన్న కాలనీల్లోని ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్, తహసీల్దార్ కె.వి.సీతారామయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గాంధీజీ అడుగుజాడల్లో నడుద్దాం

- జేసీ గోవిందరావు



గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న జేసీ గోవిందరావు

పార్వతీపురం: జాతిపిత గాంధీజీ అడుగుజాడల్లో నడుద్దామని జేసీ రోణంకి గోవిందరావు పిలుపునిచ్చారు. గాంధీ వర్ధంతిని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహనీయుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు. తన తుదిశ్వాస వరకు శాంతి, అహింసా మార్గాలను ప్రచారం చేశారన్నారు. గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలని కోరుకున్నారని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, గ్రామాలు స్వయం సమృద్ధి సాధించాలని ఆకాంక్షించారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను మనం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కె.కె.ఆర్.సి. ఎస్‌డీసీ జి.కేశవనాయుడు, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి ఉమామహేశ్వరరావు, సూపరింటెండెంట్‌లు శ్రీరామ్మూర్తి, రమణమ్మ, రవి తదితరులు పాల్గొని గాంధీకి నివాళులర్పించారు.


భక్తగిరి



కొండపై గర్భగుడిలో పూజలందుకుంటున్న మేరిమాత

- కనులపండువగా సాగిన మరియగిరి యాత్ర
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలి వచ్చిన భక్తజనం
- కులమతాలకు అతీతంగా మొక్కుల చెల్లింపు
- మరియమ్మ స్తోత్రంతో మారు మోగిన మరియగిరి ప్రాంతం
- ప్రత్యేక దివ్యపూజలుచేసిన శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి విజయకుమార్

వీరఘట్టం: శ్రీకాకుళం మేత్రాసన పాలక పునీతురాలు, క్రైస్తవుల సహాయమాత మేరిమాత మహోత్సవం మంగళవారం కనులపండువగా సాగింది. వీరఘట్టం సమీపంలోని యు.వెంకమ్మపేట వద్ద మరియగిరి కొండపై వెలసిన మరియమ్మ(మేరిమాత)కు శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి రాయరాల విజయకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక దివ్యపూజలు చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన సుమారు 40వేల మంది భక్తులు, ఆరాధకులు పూజల్లో పాల్గొన్నారు. మేరిమాతను దర్శించి మొక్కుబడులు చెల్లించారు. కులమతాలకు అతీతంగా మేరిమాతను దర్శించుకునేందుకు వచ్చిన భక్తజనంతో మరియగిరి పులకించింది. మేరిమాత స్తోత్రం మారుమోగింది. కొత్తగా సిద్ధం చేసిన మేరిమాత విగ్రహాలను పలు గురు మండలాల చర్చిలకు బిషప్ అందజేశారు.



ప్రార్థన చేస్తున్న బిషప్ విజయకుమార్

బహుమతుల ప్రదానం

సహాయమాత మహోత్సవం సందర్భంగా వీరఘట్టం, చిట్టపుడివలస, సివిని, పార్వతీపురం, బెలగాం, గరుగుబిల్లి, తూడి, పాలకొండ, వంగర, తలవరం, సంకిలి, నవగాం, పాలవలస గురుమండలాల్లో ఇటీవల నిర్వహించిన బైబిల్ పోటీలు, ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి శ్రీకాకుళం బిషప్ రాయరాల విజయకుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పీఠాధిపతులు, మఠకన్యలు, క్రైస్తవ పెద్దలు మరియగిరి ఉత్సవ కమిటీ పూజల్లో పాల్గొన్నారు.

గట్టి బందోబస్తు

మరియగిరి యాత్రకు గతేడాది కంటే రెండింతలు భక్తులు ఎక్కువగా రావడంతో పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో పాలకొండ సీఐ చంద్రమౌళి, వీరఘట్టం, సీతంపేట, దోనుబాయి ఎస్ఐ, సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించారు. భక్తుల రాకపోకలకు వీలుగా పాలకొండ, పార్వతీపురం, శ్రీకాకుళం డిపోల నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడిపారు.



దివ్యపూజలో పాల్గొన్న మరియమాత ఆరాధకులు



మరియగిరి కొండపై టెంకాయలు కొడుతున్న భక్తులు



మేరిమాతను దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

జగనన్న పాలనలోనే..

గిరిజన ప్రాంతాల అభివృద్ధి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన

పాచిపెంట: జగనన్న పాలనలోనే గిరిశిఖర ప్రాంతాల్లో అభివృద్ధి వెలుగులు విరాజిల్లుతున్నాయని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పాచిపెంట మండలంలో రూ.4.65 కోట్లతో వ్యయంతో నిర్మించిన కుంతాం నుంచి తుమ్మిగుడ్డి బీటీ రోడ్డు, రూ.1.93 కోట్లతో పూర్తిచేసిన మెట్టగుడ్డి వద్ద వంతెనను మంగళవారం ప్రారంభించారు. రూ.5.75 కోట్లతో తుమ్మిగుడ్డి వద్ద వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అడారిపాడులో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులకు అటవీశాఖ అనుమతులు రావడానికి సుమారు 3 సంవత్సరాలు పట్టిందన్నారు. సకాలంలో పనులు పూర్తిచేసిన అధికారులు, కాంట్రాక్టర్లను అభినందించారు. 14 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు గిరిజన ప్రాంతాల అభివృద్ధి గురించి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. గిరిజనులను నిలువునా మోసం చేశారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ గిరిజనులను ఉద్ధరిస్తామంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామాల్లోకి వచ్చి చెప్పే మాయమాటలు నమ్మొద్దంటూ గిరిజనులను అప్రమత్తం చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలనలో గిరిజన ప్రాంతాల్లో సంక్షేమం, అభివృద్ధి సమానంగా జరుగుతున్నాయన్నారు. కోట్లాది రూపాయల ఖర్చుతో గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, బ్రిడ్జిలు తదితర అభివృద్ధి పనులు తలపెట్టారన్నారు. గిరిజనులకు మేలుచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బడ్నాన ప్రమీల, వైస్ ఎంపీపీలు మీసాల నారాయణ, కొరిపల్లి రవీంద్రనాథ్, పార్టీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, ఉపాధ్యక్షుడు పాచిపెంట వీరంనాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జి, మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయల గౌరీశ్వరరావు, సర్పంచ్‌లు సత్తారపు నిర్మల, మజ్జి సావిత్రి, నాయకులు గండిపల్లి రాము, కొల్లి కొత్తయ్య, మజ్జి సింహాచలం, సత్తారపు రాము, బడ్నాన వీరయ్య, పెదకాపు సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



కుంతా, తుమ్మికగుడ్డి రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



అడారిపాడు వద్ద వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం

ఎస్.కె.పాడులో కల్చరల్ అడ్వెంచర్ పార్క్ ప్రారంభం



ఎస్.కె.పాడు అడ్వెంచర్ పార్క్‌ను ప్రారంభిస్తున్న కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ ఎస్.కె.పాడు హెచ్ఎన్‌టీసీ (నర్సరీ)లో రూ.1.5కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన కల్చరల్ అడ్వెంచర్ పార్క్‌ను ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్‌తో కలిసి కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి మంగళవారం ప్రారంభించారు. పార్క్ వద్ద నిర్మించిన క్యాంటీన్లు, షాపింగ్ కాంప్లెక్స్, ఆర్చ్‌ల ప్రారంభంతో పాటు ప్రత్యేకంగా తీర్చిదిద్దిన చెరువులో బోటు షికారు చేశారు. ఈ సందర్భంగా పుష్పశ్రీవాణి మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతంలో కల్చరల్ అడ్వెంచర్ పార్క్‌ను ఐటీడీఏ అధికారులు అభివృద్ధి చేయడం సంతోషదాయకమన్నారు. పర్యాటప్రేమికులకు ఈ పార్క్ ఆహ్లాదాన్ని పంచుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు కుంబురుక దీనమయ్య, శెట్టి పద్మావతి, జెడ్పీటీసీలు మండంగి రాధిక, గొర్లె సుజాత, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, స్థానిక సర్పంచ్ ఆర్.ఎస్.చైతన్య ప్రవంతి, ఈఈ జె.శాంతీశ్వరరావు, ఏపీఓ ఎ.మురళీధర్, భద్రగిరి డీఈఈ సింహాలచం, ఏఈ ఎస్.అప్పారావు, వాటర్‌షెడ్ పథకం పీఓ రెడ్డి పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భద్రగిరి ఆర్ఐటీఐలో ప్లంబర్ ల్యాబ్ ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లంబర్ ల్యాబ్‌ను కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన శిక్షణ పరికరాలను పరిశీలించారు. నిరుద్యోగులైన యువతీ యువకులు ఉచితంగా అందజేసే శిక్షణను సద్వినియోగించుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్ మాట్లాడుతూ ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా రూ.5 లక్షలతో కళాశాలలో ప్లంబర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో బ్యాచ్‌కు 2 నెలల చొప్పున శిక్షణ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా కోఆర్డినేటర్ సాయికుమార్, ఐటీఐ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



బోటుషికారు చేస్తున్న కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

అక్కచెల్లెమ్మల్లో

ఆసరా సంతోషం



వైఎస్సార్ ఆసరా సంబరాల్లో మాట్లాడుతున్న పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా కింద రుణాలు మొత్తం మాఫీ చేయడంపై పొదుపు సంఘాల మహిళలు హర్షం వ్యక్తం చేశారు. పార్వతీపురం పట్టణంలోని వెంకంపేటలో మంగళవారం జరిగిన ఆసరా సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తమకు కలిగిన ఆసరా లబ్ధిని తెలియజేశారు. మహిళలకు ఆర్థిక ఊతం కల్పిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఓటుతో మద్దతు తెలుపుతామంటూ చేతులెత్తి చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లల్లో వివిధ సంక్షేమ పథకాల కింద మహిళలకు అందించిన ఆర్థిక ప్రయోజనాలను పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు వెల్లడించారు. మండలంలోని 1154 సంఘాలకు చెందిన 12,632 మంది మహిళలకు వైఎస్సార్ ఆసరా నాలుగోవిడత కింద మంజూరు చేసిన రూ.6.09 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. - పార్వతీపురం టౌన్



ఆసరా సంబరాల్లో పాల్గొన్న మహిళలు

కరుణించు తల్లీ..





చదురుగుడి వద్ద భక్తులతో కిక్కిరిసిన క్యూకాంప్లెక్స్ (ఇన్‌సెట్లో) శంబర పోలమాంబ అమ్మవారు

- శంబర పోలమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు
- మారు జాతరకు తరలివచ్చిన జనం



మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజనుల కులదైవం, భక్తుల కొంగుబంగారం శంబర పోలమాంబ అమ్మవారి మారుజాతర మంగళవారం కనులపండువగా సాగింది. తొలిజాతరను తలపించేలా మారు జాతరకు భక్తులు తరలివచ్చారు. సుమారు లక్షన్నరకు పైగా భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు చెబుతున్నారు. ఉదయం ఐదు గంటల నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. గోముఖి నదిలో పుణ్యస్నానాలాచరించి మొక్కుబడులు చెల్లించారు. 10.30 గంటలు తరువాత ఒక్కసారిగా భక్తుల సంఖ్య పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లు కిక్కిరిశాయి. గోముఖినది బ్రిడ్జి వరకు క్యూ కొనసాగింది. భక్తులు ఇబ్బందులు పడకుండా చదురుగుడి వద్ద సాలూరు సీఐ ధనుంజయరావు, సాలూరు, మక్కువ ఎస్ఐలు ప్రయోగమూర్తి, నరసింహమూర్తి, పోలీస్ సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించారు. ప్రధానాలయంలో అమ్మవారి దర్శనం త్వరితగతిన కల్పించేందుకు జిల్లా దేవదాయశాఖ అధికారి ప్రసాదరావు, ఆలయ ఈఓ వి.వి.సూర్యనారాయణ చర్యలు తీసుకున్నారు. ప్రధానాలయం వెనుకన ఏర్పాటుచేసిన ఉచిత, రూ.20, రూ.100 దర్శనటిక్కెట్లు క్యూకాంప్లెక్స్‌ల్లో వెళ్లి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయం వెనుకన ఉన్న వేపచెట్టుకు పూజలు చేశారు. అమ్మవారి లడ్డూ, పులిహోర ప్రసాదాలను స్వీకరించారు. వనం గుడి సమీపంలోని తోటల్లో వంటావార్పు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. జాతరలో తప్పిపోయిన పాచిపెంట మండలానికి చెందిన ఓ చిన్నారిని ఎస్ఐ నరసింహమూర్తి గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

వైఎస్సార్ బీమా అందజేత



పోలయ్య భార్యకు లక్ష రూపాయల చెక్కును అందజేస్తున్న ఎంపీపీ, సర్పంచ్

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామానికి చెందిన చిన్ని పోలయ్య (36) నాలుగు నెలల కిందట పాముకాటుతో మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు వైఎస్సార్ బీమా పథకం కింద లక్ష రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. సంబంధిత చెక్కును ఎంపీపీ దమలపాటి ఉమామహేశ్వరరావు, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పాట్నూరు లక్ష్మణరావు, సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు మృతుని భార్య సంతోషికు మంగవారం అందజేశారు. బీమాతో ఆదుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి సంతోషి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

పైడితల్లికి పుష్పాలంకరణ



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తరించారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను పారబోస్తున్న పోలీసులు

కొత్తవలస: మండలంలోని రామలింగాపురం గ్రామం సమీప తోటల్లో గుట్టుగా నిర్వహిస్తున్న సారా తయారీ బట్టీలపై సీఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. పోలీసులు వస్తున్న అలికిడికి తయారీ దారులు అక్కడినుంచి పరారయ్యారు. సారా తయారీకి డ్రమ్ముల్లో సిద్ధంగా ఉంచిన పులిసిన బెల్లం ఊట సుమారు 400 లీటర్లను పోలీసులు ధ్వంసం చేశారు. అనంతరం బెల్లం ఊట నిల్వ ఉంచిన డ్రమ్ములను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ ఈ సందర్భంగా చెప్పారు.

సాహిత్యగతిని మార్చిన పది పుస్తకాలు




మాట్లాడుతున్న సాహితీవేత్త జీఎస్.చలం

విజయనగరం టౌన్: సాహిత్యగతిని మార్చిన పది పుస్తకాలు ఎంతో అద్భుతమైన రచనలని అరసం జిల్లా అధ్యక్షుడు జీఎస్.చలం పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం పది పుస్తక పరిచయాలు పేరుతో పుస్తకాలను ఆవిష్కరించారు. కూలిగింజలు, ఉచల్యా, మృతజీవులు, డోరియన్ గ్రే, కలల రైలు, బీళ్లు దున్నేరు వంటి గొప్ప రచనలను రచయితలు చేశారన్నారు. గొప్ప సామాజిక చైతన్యానికి, అట్టడుగు వర్గాల అభ్యుదయానికి, ప్రపంచ వ్యాప్త పీడిత తాడిత జనుల సాధక బాధకాలను ఈ పుస్తకాలు కళ్లకు కట్టినట్లు చూపెడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పుస్తక రచయిత వి.వెంకటరావు, వక్తలు వీఎంకే.లక్ష్మణరావు, రత్నాల బాలకృష్ణ, పీఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

- మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్ ప్రసాద్



నిరసనలో ఆర్టీసీ ఎన్ఎంయూ ఉద్యోగులు

విజయనగరం టౌన్: కళాశాల బస్సులు నడిపే డ్రైవర్లు నిబంధనలు పాటించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె. రవిశంకర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంవీజీఆర్ కళాశాలలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు -2024లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెలకువలను తెలుసుకుంటే డ్రైవింగ్ సులువవుతుందన్నారు. అదేవిధంగా ఆరోగ్యభద్రతపై పలు కీలక సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఎ.వెంకటరమణ, వి.ఐశ్వర్యలక్ష్మి, ఎం.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి ప్రాధాన్యం

- గ్రామస్వరాజ్యం దిశగా ప్రభుత్వం అడుగులు
- పంచాయతీలకు రూ.30.72 కోట్ల నిధులు
- మౌలిక వసతుల కల్పనకు మార్గదర్శకాలు



ఎస్.సీతారాంపురం పంచాయతీ కార్యాలయం

రామభద్రపురం: నాలుగున్నరేళ్ల క్రితం రాష్ట్రంలో ఏ పంచాయతీ కూడా అభివృద్ధికి నోచుకోలేదు సరికదా సరైన సౌకర్యాలు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. ఇద్దరు ముగ్గురు కంటే ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉండేవారు కాదు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రతి గ్రామంలోనూ పదిమందికి పైగా ప్రభుత్వ సిబ్బందిని నియమించారు. నగరాలతో సమానంగా మారుమూల కుగ్రామాల్లో సైతం 543 రకాలకు పైగా ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెచ్చి జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపన దిశగా పాలన సాగిస్తున్నారు. ప్రభుత్వానికి సంబంధించి ఏ పనినైనా సొంత గ్రామంలోనే పూర్తిచేసుకునే సౌలభ్యం కల్పించారు. దీనికి తోడు ప్రాధాన్యత క్రమంలో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. జిల్లాలోని 777 పంచాయతీలకు గత ఆగస్టు నెలలో 15వ ఆర్థిక సంఘం ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను మొదటి విడత రూ.23.61 కోట్లు నిధులు విడుదలవగా అందులో అన్‌టైడ్ రూ.7,81 కోట్లు, టైడ్ రూ.15,80 కోట్లు ఉన్నాయి. అలాగే ఇప్పుడు అదే ఆర్థిక సంవత్సరానికి రెండవ విడతగా రూ.30.72 కోట్లు విడుదలవగా. అందులోఅన్‌టైడ్ రూ.12,12 కోట్లు,టైడ్ రూ.18.33 కోట్లు కాగా మొదటి విడతకు వడ్డీ కింద అన్‌టైడ్, టైడ్‌లకు రూ.28.20 లక్షలు విడుదలయ్యాయి. రెండవ విడత విడుదలైన మొత్తం రూ.30.72 కోట్లు నేరుగా ఆయా గ్రామ పంచాయతీలకు సంబంధించిన యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతాల్లో పీఎఫ్ఎంఎస్ ద్వారా సర్దుబాటు అవుతున్నాయని అధికారులు తెలిపారు.ఈ నిధులతో పల్లె ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచేందుకు, తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఉపయోగించనున్నారు. పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలోనే ఎప్పటికప్పుడు బిల్లుల చెల్లింపులకు వీలుగా ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించారు. ఈ నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ ఉంటుంది. పంచాయతీలలో వివిధ ఖర్చులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ-పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో లావాదేవీల వివరాల సమాచారం ఎప్పటికప్పుడు పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులందరికీ తెలుస్తుంది. ప్రభుత్వ ట్రెజరీ అనుమతులు, లేదా ఇతర ఉన్నతాధికారుల జోక్యం కూడా ఎక్కడా ఉండదని పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు.

ఖర్చు చేయాల్సిన విధి విధానాలు..

పంచాయతీలకు జమఅయిన నిధులను టైడ్,అన్‌టైడ్‌లుగా విడగొట్టి మొదటి భాగంలో అంతర్గత రహదారులు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణం, కరెంటు బిల్లుల చెల్లింపు, గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్, పంచాయతీ భవనాల అభివృద్ధికి వినియోగించుకోవాలి. అలాగే ఈ-పంచాయతీ నిర్వహణకు కంప్యూటర్ విడిభాగాలు కొనుగోలు చేసేందుకు కూడా వినియోగించుకోవచ్చు. రెండో భాగంలో ప్రధానంగా తాగునీటి అవసరాలు, పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు, చేతి పంపులు, నీటి ట్యాంకులు, మోటార్ల నిర్వహణ బాధ్యతను ఆయా పంచాయతీలే చూసుకోవాలి. అవసరమైతే మరమ్మతులు చేయించాలి. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలతో పంచాయతీ సర్పంచ్‌లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రామభద్రపురం మేజర్ పంచాయతీ గ్రామం

మార్గదర్శకాలు ప్రకారం ఖర్చు చేయాలి..



కేంద్ర ప్రభుత్వం ద్వారా విడుదలైన రెండో విడత 15 ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వెంటనే పంచాయతీలు ఖర్చుచేయాలి. ప్రాధాన్యత, మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేసి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. వివిధ అభివృద్ధి పనులకు ఉపయోగించిన నిధులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ-పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.ఈ-ఆన్‌లైన్‌లో నమోదు చేసే బిల్లులపై ప్రభుత్వం ఏటా ఆడిట్ నిర్వహిస్తుంది. తప్పులు దొర్లితే సంబంధిత సర్పంచ్, కార్యదర్శులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

ఎస్ శ్రీధర రాజా,
జిల్లా పంచాయతీ అధికారి, విజయనగరం

దివ్యాంగులకు సేవ చేయడం అదృష్టం

- శ్రీ గురుదేవా చారిటబుల్ ట్రస్టుకు పూర్తి సహకారం
- స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ ఛైర్మన్ బండి సతీష్‌కుమార్



దివ్యాంగులకు ట్రైసైకిల్స్ అందించిన వైజాగ్ ప్రొఫెల్స్ సీఎండీ బండి సతీష్‌కుమార్

కొత్తవలస: దివ్యాంగులకు సేవ చేయడం గొప్ప అదృష్టంగా భావించాలని వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించి అండగా నిలవాలని వైజాగ్ ప్రొఫెల్స్, స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ ఛైర్మన్ బండి సతీష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు కొత్తవలస మండలంలోని మంగళపాలెం గ్రామంలో గల శ్రీగురుదేవా చారిటబుల్ ట్రస్టును ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులకు గురుదేవా చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు ఎందరికో ఆదర్శప్రాయమన్నారు.ట్రస్టు ఛైర్మన్ రాపర్తి జగదీష్‌కుమార్ తన జీవితాన్ని దివ్యాంగుల సేవలకే అంకితం చేయడం గొప్పవిషయమని ప్రశంసించారు. ఈ ట్రస్టు ఆధ్వర్యంలో తయారు చేస్తున్న కృత్రిమ అవయవాలు దేశంలో మరెక్కడా తయారు చేయలేదన్నారు. ఎంతోమందికి నడక నేర్పి, ఎందరో దివ్యాంగుల జీవితాల్లో కొత్తవెలుగులను నింపిన గురుదేవా చారిటబుల్ ట్రస్టుకు తమ కర్మాగారం తరఫున పూర్తిసహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.అనంతరం ట్రస్టు ఛైర్మన్ జగదీష్‌కుమార్ మాట్లాడుతూ స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ ఇప్పటికే ట్రస్టు నిర్వహణకు ఎంతగానో సహాయపడుతోందని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 20 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు, 60మంది అంధులకు బ్లెయిండ్ స్టిక్స్, క్యాలిపర్స్, వీల్ ఛైర్స్ అందజేశారు. అలాగే వంద మందికి బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు ఎం.గాంధీ, వెంకటేశ్వరరావు, ట్రస్టు వైస్ ఛైర్మన్ డాక్టర్ ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం



గాత్రకచేరీ నిర్వహిస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు

విజయనగరం టౌన్: స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాలలో మంగళవారం త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం వేడుకగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కేవీఎల్ఎస్.శాస్త్రి ఆధ్వర్యంలో త్యాగరాజ చిత్రపటానికి విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు త్యాగరాజ కృతులు ఆలపించారు. ఉదయం పంచరత్న సేవను నిర్వహించగా సాయంత్రం కళాశాల విద్యార్థులు ధనలక్ష్మి, సుభద్రాదేవి, కరుణచంద్రిక, ధనలక్ష్మి, జానకీదేవి, సంధ్యలు గాత్రం అధ్యాపకురాలు సీహెచ్.రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో గాత్రకచేరీ చేశారు. వయోలిన్‌పై పి.సురేష్‌కుమార్, మృదంగంపై పి.వెంకటరావు సహకరించారు. తరువాత కాకినాడనుంచి వచ్చిన జి.అరుణ గాత్రకచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. వయోలిన్‌పై హెచ్.రామచరణ్, మృదంగంపై ఎం.కామేష్‌లు సహకారమందించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జ్వరంతో చిన్నారి మృతి



మృతిచెందిన నైనిక

కొమరాడ: మండలంలోని చోళ్లపదం పంచాయతీ రెబ్బ గ్రామనికి చెందిన కద్రక పారయ్య సూరమ్మల కుమార్తె చిన్నారి నైనిక జ్వరంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఆ దంపతలకు ఇద్దరు ఆడపిల్లలు కగా మొదటి పాప శ్రీలత మూడోతరగతి చదువుతుండగా రెండవ పాప నైనికకు ఏడాది వయస్సు. ఆ ఇద్దరికీ ఈ నెల 21న జర్వం రావడంతో 22 తేదీన కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం తీసుకువచ్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఇద్దరు పిల్లలను పార్వతీపురం ఆస్పత్రికి తరలించారు వారి ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో జిల్లా కేంద్రాస్పత్రి వైద్యులు విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించగా మొదటి పాప శ్రీలత ఆరోగ్యం మెరుగుపడింది. రెండో పాప నైనిక చిన్నారి కావడం , సరైన సమయానికి చికిత్స అందక కేజీహెచ్‌లో మృతి చెందినట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. వాస్తవంగా కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండరు. గిరిశిఖర గ్రామమైన రెబ్బలో స్థానికంగా వైద్యసిబ్బంది ఉండడం లేదని ప్రస్తుతం అక్కడ వాతావరణంలో మార్పులతో గ్రామంలో మలేరియా జ్వరాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

సెంచూరియన్‌ను సందర్శించిన అధ్యాపకులు



ప్రయోగశాల గురించి వివరిస్తున్న సెంచూరియన్ చాన్స్‌లర్ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని విశాఖపట్నానికి చెందిన పలువురు అధ్యాపకులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు వారికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కోర్సులు, ప్రయోగశాలలు, తదితరాల గురించి వివరించారు. అనంతరం వారంతా బ్యాటరీలతో నడిచే ఆటోల తయారీ యూనిట్, కుట్టు యంత్రాల యూనిట్, ప్రయోగశాలలను తిలకించారు. ప్రశాంతంగా విద్యార్థులు చదువుకునేందుకు వర్సిటీలో అనుకూలమైన వాతావరణం ఉందని ప్రశంసించారు. కార్యక్రమంలో వర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి భద్రత మహోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, తదితరులు

విజయనగరం టౌన్: జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాల సందర్భంగా జిల్లా రహదారి భద్రత కమిటీ సభ్యుడు మజ్జి అప్పారావు నేతృత్వంలో కలెక్టర్ నాగలక్ష్మి మంగళవారం కలెక్టరేట్ చాంబర్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రోడ్డు భద్రత అంశాలను వివరించారు. కార్యక్రమంలో రవాణాశాఖ ఉప కమిషనర్ రవీంద్రనాథ్, ఎన్‌జీఓ సభ్యులు ఎస్.హరిబాబు, శ్రీరామమూర్తి, ఎ.కృష్ణ, పరమేశు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రాజాం సిటీ: అనారోగ్యంతో బాధపడుతున్న గుర్తుతెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడని ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో ఉన్నట్లు ఈ నెల 24న స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు 108 సహాయంతో రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని వివరాలకోసం విచారణ చేపడుతున్నామని చెప్పారు. ఎవరికైనా తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

కోవిడ్‌లో ప్రాణాలు పణంగా పెట్టి వైద్యుల సేవలు



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ఓ భాస్కరరావు, డాక్టర్ జయచంద్రనాయుడు

- డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: యావత్ ప్రపంచాన్ని వణికించిన కోవిడ్ మహమ్మారి బారినపడిన రోగులకు చికిత్స అందించే సమయంలో కొంత మంది వైద్యులు మృతి చెందారని డీంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు అన్నారు. జాతీయ కోవిడ్ అమర వైద్యుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఐఎంఏ హాల్ వద్ద ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాక్సిన్ లేని సమయంలో కూడా వైద్యులు ఎంతో ధైర్యంతో తమ ప్రాణాలను పణంగా పెట్టి కోవిడ్ రోగులకు వైద్య సేవలు అందించారని చెప్పారు. జిల్లాలో డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ రవికుమార్ కోవిడ్ బారిన పడి మృతి చెందారని చెప్పారు. వారి సేవలను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ముద్రు జయచంద్రనాయుడు, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వీఎస్. ప్రసాద్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వి.అశోక్, అప్నా అధ్యక్షుడు డాక్టర్ మహేంద్ర గిరి, డాక్టర్ శ్రీరామ్మూర్తి, డాక్టర్ మధుకర్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

స్పర్శలేని మచ్చ ఉంటే కుష్ఠు నిర్ధారణ పరీక్ష

స్పర్శలేని మచ్చ ఉన్నవారు కుష్ఠు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు తెలిపారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి డీఎంహెచ్ఓ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్పర్శ, నొప్పి లేని మచ్చలు ఉన్న వారు సమీపంలో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లి పరీక్ష చేయించుకోవాలని కోరారు. కుష్ఠు వ్యాధిని త్వరగా గుర్తిస్తే అంగవైకల్యం బారిన పడకుండా కాపాడవచ్చునన్నారు. గ్రామ సభల ద్వారా జనవరి 30 వతేదీ నుంచి ఫిబ్రవరి 13 వరకు అవగాహన కల్పిస్తామని తెలిడిపారు. కార్యక్రమంలో డీఎల్ఓ డాక్టర్ కె.రాణి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సోమరాజుపేటలో విషాదఛాయలు

రేగిడి: పీఆర్ జేఈ ఆత్మహత్యతో రేగిడి మండల పరిధి సోమరాజుపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రామకృష్ణ మృతదేహానికి మంగళవారం రాజాం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు పోలీసులు అప్పగించారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకురావడంతో కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులతో రోదనలు మిన్నంటాయి. గ్రామంలో ఎటువంటి ఉద్రిక్త వాతావరణం తలెత్తకుండా ఉండేందుకు ఎస్సై శ్రీనివాసరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. రామకృష్ణ మృతి పట్ల గ్రామంలోని పెద్దలతో పాటు పలు పార్టీల నేతలు సంతాపం వ్యక్తంచేశారు.

70 మద్యం సీసాలు స్వాధీనం

రాజాం సిటీ: ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. దీనిపై ఎస్సై రవికిరణ్ మాట్లాడుతూ స్థానిక పాలకొండ రోడ్డులోని సత్య కాంప్లెక్స్ వద్ద గురవాం గ్రామానికి చెందిన గొడే గోవిందరావు బైక్‌పై మద్యం బాటిల్స్ తరలిస్తుండగా అరెస్టు చేశామని తెలిపారు. నిందితుడి నుంచి 25 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశామన్నారు. అలాగే అదేగ్రామానికి చెందిన తంగుడు రమేష్‌ను గ్రామసమీపంలో అరెస్టు చేశామని మరో ఎస్సై జి.పోలినాయుడు తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న 45 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చికెన్	బ్రాయిలర్	లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
		₹120	₹210	₹220

సిగ్నల్ కష్టాలకు 'సెల్లు'



- మన్యంలో సమాచార విప్లవం
- మరికొద్ది రోజుల్లో పూర్తిస్థాయిలో మొబైల్ సేవలు
- జిల్లాలో ఏర్పాటు కానున్న 182 సెల్‌టవర్లు
- మెరుగుపడనున్న కమ్యూనికేషన్ వ్యవస్థ

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలో చాలా గ్రామాల్లో కొండలు ఎక్కితే గాని సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందని పరిస్థితి. ఫోన్ చేయాలంటే కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లాల్సి వస్తుంది. దీంతో అత్యవసర సమయాల్లో సమాచారం అందక వైద్య, ఇతర సేవలు పొందలేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఆన్‌లైన్ సరిగా అవక పథకాల మంజూరులో కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఈ కష్టాలకు చెక్‌పడనుంది. జిల్లాలో 182 మొబైల్ టవర్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి..

సీతంపేట మండలంలో దశాబ్దాల కాలంగా సెల్‌సేవలు పలు గ్రామాల్లో లేవు. కొండశిఖర గ్రామాల్లో తుంబలి, గాడిదపాయి, దుగ్గి, చిన్నపొల్ల, దాసుగుమ్మడ, వంబరెల్లి, అంటికొండ, గుజ్జి, చిన్నపల్లంకి, మీనకోట, పెద్దకంబ, జొనగ, జజ్జువ, వజ్జాయిగూడ, ఆడలి, సంతమల్లి, ముత్యాలు, గోలుకుప్ప, గులుమూరు, సార, దేవగిరి, గజిలి, పెద్దవంగర, పూతికవలస, శంబాం, కుసుమూరు, కొత్తకోటలలో మొబైల్‌టవర్లు ఏర్పాటు కానున్నాయి. మారుమూల గిరిజన ప్రాంతాల్లో సుమారు 450కు పైగా గ్రామాలకు కమ్యూనికేషన్ వ్యవస్థ లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో 108కు ఫోన్ చేయాలన్నా అవ్వని పరిస్థితి. గ్రామవలంటీర్‌లు పింఛన్‌లు ఇవ్వాలన్నా సెల్‌సిగ్నల్ ఉన్న ప్రదేశాలకు వచ్చి ఇవ్వాలి. సుదూర ప్రాంతాలకు కొండలపై ఎక్కితేనే సిగ్నల్స్ లభిస్తాయి. పథకాలు ఆన్‌లైన్ చేయాలన్నా, ఫేషియల్ హాజరు వేయాలన్నా ఉద్యోగులకు కూడా అవస్థలు తప్పడం లేదు.ఈ నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో సిగ్నల్ కష్టాలకు తెరపడనుంది.

త్వరలోనే పూర్తి

4 జి శాట్యురేషన్ ప్రాజెక్టు ఎక్విప్‌మెంట్ రావాల్సి ఉంది. ఇతర దేశాలవి కాకుండా ఇండియా సామగ్రి మాత్రమే వాడాలి. పంజాబ్ సర్కిల్‌లో కొన్ని పార్టులు టెస్టింగ్ అవుతున్నాయి. అవి వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తాం. ఇది 500ల రోజుల ప్రోగ్రాం, ఇప్పటికి 400 రోజుల పనులు చేశాం. మరో వంద రోజుల్లో పనులు పూర్తవుతాయి. కేబుల్‌లైన్ దాదాపు పూర్తికావచ్చింది.

డి.అప్పారావు,
అసిస్టెంట్ జనరల్‌మేనేజర్